క్లుప్తంగా

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 16 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు 15 మందికి చేశామన్నారు.

చందానగర్ ఎస్‌హెచ్‌ఓగా పాలవెల్లి



హఫీజ్‌పేట్ : చందానగర్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా పాలవెల్లి బాధ్యతలు చేపట్టారు. బుధవారం సీఐ క్యాస్ట్రోరెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల రక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

అనుభవపూర్వక అభ్యాసం తప్పనిసరి



మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

పటాన్‌చెరు: ఒక పనిని చేయడం ద్వారా నేర్చుకునే ప్రక్రియనే ప్రయోగాత్మక అభ్యాసం అంటారని, అనుభవపూర్వక అభ్యాసం సాంకేతిక విద్యాసంస్థల్లో తప్పనిసరి అని క్వాప్రికాట్ టెక్నాలజీస్ ప్రొడక్ట్ మేనేజర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'మెషిన్ లెర్నింగ్- ఇట్స్ అప్లికేషన్ ఇన్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ' అంశంపై మూడు రోజుల అధ్యాపక వికాస కార్యక్రమం ముగింపును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవపూర్వక అభ్యాసం నైపుణ్యాలు, ఆసక్తి, అభిరుచి, విలువలు, విభిన్న సంస్థలతో వ్యవహరించే నేర్పు, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుందన్నారు. ప్రేమ్‌కుమార్, టిక్-టాక్-టోను ప్రదర్శించిన రామ్ కుమార్, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి, నిర్వాహకుడు ప్రొఫెసర్ కె. మంజునాథాచారిని సత్కరించారు. కార్యక్రమంలో ఈఈసీఈ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీవీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే డబుల్ ఇళ్లు కేటాయించాలి



తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళుతున్న బీజేపీ నాయకులు

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో 75 శాతం అర్హులైన స్థానిక పేదలకు కేటాయించాలని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో పటాన్‌చెరు నియోజకవర్గ నాయకులు గోదావరి అంజిరెడ్డి, ఎడ్ల రమేశ్, శంకర్‌యాదవ్, మోహన్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి కలసి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేయకపోతే నియోజకవర్గ పరిధిలో బీజేపీ నాయకులతో కలసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు.

మట్టి రోడ్లు.. మురుగునీరు



కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ బస్తీలో అంతర్గత రోడ్ల దుస్థితి

ఇదీ ప్రేమ్‌నగర్ బస్తీ దుస్థితి..

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధి ప్రేమ్‌నగర్ బస్తీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. నానాటికీ పెరుగుతున్న ఇళ్ల నిర్మాణాలకు తగ్గట్లుగా అభివృద్ధి జరగడం లేదు. కాలనీలోని ప్రధాన రోడ్లు తప్ప మిగతా రోడ్లు గుంతలమయంగా మారాయి. కొన్ని రోడ్లు ఎత్తు, పల్లాలుగా తయారయ్యాయి. దీంతో రోడ్డుపై నడవాలంటే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఇళ్ల ముందు మురుగునీరు చేరుతోంది. దీంతో దోమలు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. డివిజన్‌లో అధికంగా నివాసముండే బస్తీలు ఇవేనని.. కనీస వసతులు కల్పించాలని స్థానిక ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

- ప్రేమ్‌నగర్ బస్తీలో ప్రధానరోడ్లు మాత్రం సీసీ వేశారు. అంతర్గత రోడ్లు వదిలేశారు.
- డ్రైనేజీ రోడ్డుపైకి రావడంతో రోడ్డు గుంతలమయంగా మారింది.
- గుంతల్లో మురుగు నిలవడంతో దోమలు ప్రబలి విష జ్వరాలు వస్తున్నాయి



రోడ్లపై నిలిచిన మురుగునీరు



- మురుగు కాలువలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ పనులు వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలి
- హఫీజ్‌పేట్ రైల్వే ట్రాక్ పక్కన రాత్రి సమయంలో ఆకతాయిలు గంజాయితో పాటు మద్యం సేవించి స్థానిక మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.
- బెల్టు షాపుల వల్ల బస్తీలలో ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగుతూ ఇబ్బందిపెడుతున్నారని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు.
- రాత్రి సమయాలలో రైల్వే ట్రాక్ సమీపంలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని బస్తీవాసులు కోరుతున్నారు
- ఇంటి నంబర్లను కేటాయించినా ఆస్తి పన్ను కట్టలేకపోతున్నామని తెలిపారు.
- వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయాలలో అవస్థలపాలవుతున్నామన్నారు.:స.

సీసీ రోడ్లు వేయాలి



ప్రేమ్‌నగర్ బస్తీలలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్లు వేయాలి. పెండింగ్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను వెంటనే చేపట్టాలి.

– సలీం, ప్రేమ్‌నగర్‌వాసి

వీధి దీపాలు, సీసీ కెమెరాలు కావాలి



ప్రేమ్‌నగర్ బస్తీలో ఆకతాయిలతో ఇబ్బందులు పడుతున్నాం. హఫీజ్‌పేట్ రైల్వే ట్రాక్ దగ్గర ఉన్న బస్తీలోని మహిళలను కొంత మంది యువకులు మద్యం, గంజాయి తాగి ఇబ్బందిపెడుతున్నారు. కార్డన్ సర్చ్‌లో కూడా మా సమస్యలను వివరించాం. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి.

–గౌస్, ప్రేమ్‌నగర్ బస్తీవాసి

అందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లిలో రూ.75లక్షల నిధులతో నిర్మించిన ముదిరాజ్, కురుమ, కుమ్మరి కుల సంఘాల భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలబడిందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్ శంషాబాద్ రాజు, బాలజీ, శ్రీశైలం యాదవ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేశ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, తెల్లాపూర్ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, నాయకులు శ్రీపాల్ రెడ్డి, ఇంద్రారెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



కుల సంఘాల భవనంను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

బ్యాంక్ ఉద్యోగినిపై యువకుడి దాడి

డయల్ 100కు ఫోన్ చేసిన స్థానికులు

గచ్చిబౌలి: బ్యాంక్ ఉద్యోగినిపై ఓ యువకుడు దాడి చేశాడు. గచ్చిబౌలిలోని డీఎల్‌ఎఫ్ రోడ్డులో ఉన్న ఐసీఐసీఐ బ్యాంకులో ఓ యువతి రిలేషన్స్ మేనేజర్‌గా పనిచేస్తోంది. బుధవారం మధ్యాహ్నం ఓ యువకుడు బ్యాంక్ లోపలికి వచ్చాడు. యువతి వద్దకు వెళ్లి బిగ్గరగా అరవడంతో ఆమె బయటకు వచ్చింది. ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో భార్గవ్ ఆ యువతిపై చేయిచేసుకున్నాడు. దీంతో యువతి ప్రతి దాడి చేసిందని, ఆ తర్వాత మళ్లీ యువకుడు దాడికి పాల్పడ్డారని స్థానికులు చెప్పారు. వారు వెంటనే డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించారు. వెంటనే గచ్చిబౌలి పెట్రోల్ మొబైల్ పోలీసులు బ్యాంక్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే ఆ యువతి బ్యాంక్ లోపలికి వెళ్లింది. ఫిర్యాదు చేసేందుకు నిరాకరించడంతో పోలీసులు వెనుదిరిగారు. తాను పోలీస్ అధికారి కొడుకును అని, ఎవరికి చెప్పినా ఏమీ కాదని యువకుడు కేకలు వేసినట్టు స్థానికులు చెబుతున్నారు. గొడవ జరిగిన కొద్దిసేపటికి ఆ యువకుడి తండ్రి వచ్చి తీసుకెళ్లినట్టు సమాచారం. ఇది ఇలా ఉంటే సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించామని, ఫిర్యాదు చేసేందుకు యువతి సుముఖంగా లేదని పోలీసులు చెబుతున్నారు. గతంలో ఇద్దరు కలిసి ఒకేచోట పని చేసినట్లు తెలిసిందని, గొడవకు గల కారణాలు తెలియవని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు గచ్చిబౌలి సీఐ జేమ్స్ బాబు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి బీజేవైఎం నేత రఘునాథ్ యాదవ్

గచ్చిబౌలి: బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి మారబోయిన రఘునాథ్ యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు కొండాపూర్‌లో బుధవారం ప్రకటించారు. ఇటీవల ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గేను కలిశారు. అక్కడే తెలంగాణ పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. జూలై 2న ఖమ్మంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీలో చేరుతానని రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. తనతో పాటు బీజేవైఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కుమార్ సాగర్, కొండాపూర్ డివిజన్ జాయింట్ సెక్రటరీ శ్రీకాంత్ , ప్రవీణ్, రాములుగౌడ్, జీవన్‌కుమార్, సాంబయ్య తదితరులు చేరుతారని తెలిపారు.



రేవంత్ రెడ్డిని కలిసిన రఘునాథ్ యాదవ్

అధికారులతో ప్రత్యేక సమావేశం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో బుధవారం కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు కార్యాలయంలో అన్ని శాఖల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి

పటాన్‌చెరు టౌన్: బక్రీద్ పండగను పురస్కరించుకొని అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. పటాన్‌చెరు శివారు ఈద్గాలతోపాటు నియోజకవర్గంలోని ఈద్గాలు, మసీదుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. బక్రీద్ సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పటాన్‌చెరు నుంచి లింగంపల్లి జాతీయ రహదారిపై పొట్టేళ్ల విక్రయాలు జోరందుకున్నాయి. వ్యర్థాల తరలింపునకు బయో డిగ్రేడబుల్ బ్యాగులు, రెండు టిప్పర్లు, జేసీబీ అందుబాటులో ఉంచారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఈద్గా, దర్గా వద్ద జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కార్పొరేటర్ పారిశుద్ధ్య పనులు చేయించారు.

చెరువులో మృతదేహం లభ్యం



మియాపూర్: చెరువులో యువకుని మృతదేహం లభ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మియాపూర్‌లోని లక్ష్మీనగర్ కాలనీలోని నాయినమ్మకుంట చెరువులో ఓ వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు మంగళవారం రాత్రి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. అతని వద్ద ఎలాంటి సమాచారం లభ్యం కాలేదు. చుట్టు ప్రక్కల ఆరా తీయగా ఎలాంటి సమాచారం లభించలేదు. ఆ వ్యక్తి 30–35 ఏళ్ల వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పెన్షన్ మంజూరు పత్రాలు అందజేత



పెన్షన్ మంజూరు పత్రాలు అందజేసిన అధికారులు

పటాన్‌చెరు టౌన్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో ప్రతీనెలా పెన్షన్ మంజూరు పత్రాలు ఉద్యోగ విరమణ పొందిన పీఎఫ్ చందాదారులకు సకాలంలో పంపిణీ చేస్తుందని పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్ తెలిపారు. పటాన్‌చెరు ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయంలో 19 మంది పదవీ విరమణ పొందిన చందాదారులకు బుధవారం పెన్షన్ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్‌లో 42 మంది చందాదారులకు పత్రాలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్లు పీవీరావు, శ్రీదేవి, అకౌంట్స్ ఆఫీసర్ బాబులీనాథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పరిశీలన

కూకట్‌పల్లి:కూకట్‌పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు అత్యాధునిక హంగులతో కార్యాలయాన్ని నిర్మిస్తున్నామని, త్వరలోనే దీన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.



పీస్ కమిటీ సమావేశం



మియాపూర్: బక్రీద్, బోనాల పండగ సందర్భంగా మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మియాపూర్, హాఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని ఆలయాల కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలతో పోలీసులు సమావేశమయ్యారు. పండగలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మియాపూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యవేక్షణ ఏదీ..?

పార్కులపై పర్యవేక్షణ లేమి..
అభివృద్ధిలో చిత్తశుద్ధి లేదు.. ఓపెన్ జిమ్‌ల మరమ్మతులు లేవు.. ఈ సమస్యలపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు. సేద తీరేందుకు, పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన పార్కుల పట్ల అధికారులకు ఇంత నిర్లక్ష్యం ఏమిటిని ఆవేదన చెందుతున్నారు.

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్, బాచుపల్లి,నిజాంపేట్ ప్రాంతాల్లోని 33 వార్డుల్లోని 114 పార్కులకు గాను 90 శాతం పార్కుల్లో అభివృద్ధి పనులు పూర్తి కాలేదు. కొన్నింటిలో ఇంకా ఏ పనులు ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. లక్షలాది నిధులు వెచ్చించి పనులు ప్రారంభించిన పార్కుల్లో పూర్తి స్థాయిలో కాకపోగా.. పూర్తయినవి సైతం పాడైపోతున్నాయి. దీనిపై ప్రజలు పలుమార్లు అధికారులు, కార్పొరేటర్లకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతుందని, నిధులు వృథా అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.



- నిజాంపేట్ మున్సిపల్ పరిధిలోని ప్రగతినగర్‌లోనే ఏకంగా 52 పార్కులు ఉన్నాయి. అందులో గతంలో గ్రామ పంచాయతీగా పాలనలోనే అభివృద్ధి జరిగిన పార్కులు తప్ప మున్సిపల్‌గా మారిన తరువాత పూర్తి అభివృద్ధి జరిగిన పార్కులు లేవని ప్రజలు అంటున్నారు. అభివృద్ధి పనులు ప్రారంభించి పనులు పూర్తి కాక అసంపూర్తిగా మిగిలి ఉన్న పార్కులే ఎక్కువగా ఉండటం గమనార్హం.

ఓపెన్ జిమ్‌లు..పాడైన పరికరాలు

పార్కుల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్ర వినిపిస్తున్నాయి. ప్రగతినగర్, నిజాంపేట్, బాచుపల్లి ప్రాంతాల్లోని వార్డుల్లో పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. స్థానికులు వ్యాయామం చేసే క్రమంలో రిపేర్లు అవసరం అవుతాయనే ఆలోచన కూడా అధికారులకు లేకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు, పార్కుల పరిస్థితిని సమీక్షించే సమయం అధికారులు, మేయర్, కార్పొరేటర్లకు లేదా? అని ప్రశ్నిస్తున్నారు.

- ఉదాహరణకు ప్రగతినగర్‌లోని వాసవీ లేఅవుట్‌లో ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణ పార్కులో ఏడాది క్రితం ప్రారంభించిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలాయి. అరకొర పనులు చేసి వదిలేస్తున్నారు. ఓపెన్ జిమ్‌లోని పరికరాలు రిపేర్‌కు వచ్చి సంవత్సరం అవుతున్నా ఇప్పటి వరకు వాటిని రిపేర్ చేయలేదు. పార్కు బోర్డు సైతం కింద పడిపోయింది. పట్టించుకున్న వారు లేరు.

పట్టింపులేమి..

పార్కుల అభివృద్ధిని అధికారులు పట్టించుకోవడం లేదు.పార్కుల పరిస్థితిపై కనీసం రివ్యూ చేయలేకపోవడంను బట్టి అధికారుల చిత్తశుద్ధి తెలుస్తోందని, పార్కులను పట్టించుకోరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నిర్వహణ అస్సలు లేదు....

ఓపెన్ జిమ్‌లు అంటేనే తొందరగా రిపేర్లకు వస్తాయన్న విషయం అధికారులకు తెలియాదా? ఏర్పాటు చేసి సంవత్సరాలు గడుస్తున్నా అవి ఎలా ఉన్నాయి. ఎలా పని చేస్తున్నాయి అని పరిశీలించే తిరిక అధికారులకు లేదా? జిమ్ పరికరాలు కొన్ని విరిగిపోతున్నా పట్టించుకునే వారు లేదు. విరిగిపోయి కింద పడిపోయిన వాటిని రాత్రి సమయాల్లో చోరీకి గురవుతున్నాయి.

– రామ్‌మోహన్

ఓటరు నమోదు



ఓటు కోసం నమోదు చేసుకుంటున్న యువత

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీలో డివిజన్ బీజేవైఎం ఆధ్వర్యంలో యువ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో 18 ఏళ్లు నిండిన యువకులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించి ఓటరుగా నమోదు చేయించారు. కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు మాణిక్‌రావు, బీజేవైఎం రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. జితేందర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, డివిజన్ దళిత మోర్చ అధ్యక్షులు ప్రభాకర్, జితేందర్, మహేష్‌యాదవ్, వెంకట్, బాషా, విశాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.